

భరోసా అందక నిరాశ..!

సముద్రంలో చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేట నిషేధ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. - 8లో



బడిపిల్లలకు కంటిపరీక్షలు - 8లో

ప్రస్తుతం మొబైల్ హవా సాగుతుండడంవల్ల పిల్లల్లో దృష్టి లోపాలు అధికంగా ఉన్నట్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థుల ఐ స్క్రీనింగ్ కార్యక్రమంలో వెల్లడైంది.

21న పబ్లిక్ గ్రీవెన్స్

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఈ నెల 21న జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హాజరు కానున్నట్టు ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజనులు తమ సమస్యలపై వినతులు ఇవ్వవచ్చన్నారు. వివిధ విభాగాల అధికారులంతా హాజరు కావాలన్నారు.

న్యూస్‌రీల్

21న పార్వతీపురంలో మెగా జాబ్‌మేళా



పార్వతీపురం టౌన్: పార్వతీపురంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ చదువుకుని 18 నుంచి 30 సంవత్సరాలు ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో 18 కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీల కోసం ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://స్కిల్‌యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబరుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరుగనున్న ప్రాంతానికి హాజరు కావాలని కోరారు. వివరాలకు 63051 10947, 89788 78557 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సూరంపేటలో ఏనుగుల గుంపు



సూరంపేట తోటలో ఏనుగుల గుంపు

సీతానగరం: మండలంలోని సూరంపేటలో ఏడు ఏనుగులు గురువారం సంచరించడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. తాన్న సీతారాంపురం – సూరంపేట గ్రామాల మధ్య ఉన్న టేకు మామిడి తోటల్లో ఇవి కనిపించడంతో వ్యవసాయ పనుల కోసం రైతులు వెళ్లేందుకు భయపడుతున్నారు. గడిచిన పది రోజులుగా తాన్నసీతారాంపురం గ్రామ తోటల్లో సంచరిస్తూనే సూరంపేటకు చేరాయి. పొలం పనులకు వెళ్లేవారు గుంపుగా వెళ్లాలని అటవీ శాఖ కేర్ టేకర్లు గ్రామాల్లో ప్రజలకు సూచించారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



పైడితల్లి అమ్మవారి కల్యాణ మండపంలో హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు హుండీల ఆదాయం గురువారం ఆలయ కల్యాణ మండపం ఆవరణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ చదురుగుడిలో ఉన్న తొమ్మిది శాశ్వత, ఎనిమిది తాత్కాలిక హుండీల నుంచి రూ.43 లక్షల 53వేల 265 నగదు, చిల్లర రూపేణా రూ.లక్షా 48వేల 985 వెరసి రూ.45 లక్షల 2వేల 250 ఆదాయం లభించిందన్నారు. బంగారం 40 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి 955 గ్రాములు లభించాయి. 21 అమెరికా డాలర్లు, రూ.50 వేలు విలువైన ఇండోనేషియా కరెన్సీ నోట్లు లభించాయన్నారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో ఉన్న ఏడు హుండీలను తెరవగా 45 రోజులకుగానూ నగదు రూపంలో రూ.10 లక్షల 79వేల 513 నగదు, చిల్లర రూపంలో రూ.61వేల 638 ఆదాయం లభించిందని తెలిపారు.

పోయాం.. మోసం!

- అవే ధరలు, అవే బ్రాండ్లు
- రూ.99 మద్యం ఊసే లేదు..
- కొత్తగా వచ్చినవి ఐబీ, ఎంసీలే
- గగ్గోలు పెడుతున్న మద్యం ప్రియులు
- సామాజిక మాధ్యమాల్లోనూ సెటైర్లు



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పోస్టు



సాక్షి, పార్వతీపురం మన్యం :

తామ అధికారంలోకి వస్తే మంచి బ్రాండ్ల మద్యం సరఫరా చేస్తామని.. రూ.99కే నాణ్యమైన మందు అందిస్తామని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు... మద్యం ప్రియులకు గట్టి ఝులక్ ఇచ్చారు. నూతన మద్యం పాలసీ అంటూ.. ప్రభుత్వ దుకాణాలకు మంగళం పాడి, వైన్‌షాపులను 'తమ్ముళ్ల' చేతిలో పెట్టారు. జిల్లాలో కొత్తగా 52 దుకాణాలు ఏర్పడగా.. ఈ నెల 16 నుంచి ఒక్కొక్కటీ తెరుచుకుంటున్నాయి. ధరలు తగ్గాయని.. తమకు నచ్చిన బ్రాండ్లు దొరుకుతాయని ఆశగా వెళ్లిన మందుబాబులకు షాక్ తగిలేలా ధరలున్నాయి.

రూ.99 బ్రాండ్ ఇంకా రాలే..

రూ.99కే నాణ్యమైన మద్యం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఇంకా ఆ నిల్వలను ఎక్కడా అందించలేదు. ఆ ధరతో మందు అడిగితే.. 'సిండికేట్' వ్యాపారుల నుంచి లేదనే సమాధానం వస్తోంది. ఆ సరకు వచ్చేసరికి మూడు, నాలుగు రోజులు పట్టవచ్చని ఎక్సైజ్ అధికారులే చెబుతున్నారు. మరోవైపు దుకాణాల్లో చీప్ లిక్కర్ క్వార్టర్ ధర రూ.130 వరకు వసూలు చేస్తున్నారు. మంచి బ్రాండ్లు అంటూ ఐబీ, ఎంసీ విస్కీలను అందుబాటులో ఉంచినప్పటికీ.. అవి కూడా క్వార్టర్ రూ.180 వరకు జిల్లాలో ఉంది. ఏసీ బ్లాక్, రాయల్ ప్యాలస్, వైట్ హౌస్ వంటి మందు రూ.150 వరకు ఉంది. బీర్లు సైతం రూ.200కు ఎక్కడా తక్కువ ఉండటం లేదు. కొన్నిచోట్ల గతంలో ఉన్న ధరల కంటే రూ.10 పెంచారు. దుకాణాల వ్యవహారం అన్నీ సర్దుకున్నాక.. బాటిల్‌పై రూ.10 వరకు అనధికారికంగా పెంచేందుకు జిల్లాలోని సిండికేట్ వ్యాపారులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 52 దుకాణాలను కేటాయించగా.. త్వరలో మరో ఆరు షాపులకు నోటిఫికేషన్ వెలువడనుంది. నిబంధనల ప్రకారం కల్లుగీత కార్మికులకు 5, ప్రీమియం షాపు ఒకటి ఇంకా ఏర్పడాల్సి ఉంది. గీత కార్మికులకు ఇచ్చే దుకాణాలనూ బినామీ పేరులతో దక్కించుకునేందుకు కూటమి 'తమ్ముళ్లు' పావులు కదుపుతున్నారు.

మందుబాబుల గగ్గోలు

మద్యం దుకాణాల్లో లభిస్తున్న మందు, ధరలను చూసి మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. అవే బ్రాండ్లు.. అవే ధరలు... ఏం మారిందంటూ ఆవేదన చెందుతున్నారు. కొత్తగా ఇస్తామన్న మందు ఏదీ లేదని.. ధరలు ఏ మాత్రమూ తగ్గించలేదని ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తున్నారు. ఇదే విషయమై పలువురు సామాజిక మాధ్యమాల్లోనూ సెటైర్లు వేస్తున్నారు.

రూ.99 బ్రాండ్ అడిగితే లేదన్నారు..

మద్యం దుకాణాలు ప్రభుత్వం నుంచి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. నిన్న ఒక దుకాణానికి వెళ్లి రూ.99 బ్రాండ్ మద్యం అడిగితే లేదన్నారు. చీప్ లిక్కర్ రూ.130 అంటున్నారు. నచ్చితే అది తీసుకోవచ్చు.. లేదంటే వెళ్లిపోవచ్చని తెగేసి చెప్పారు. ప్రభుత్వం మాటలు విని మోసపోయాం.

\- బి.రమేష్, పార్వతీపురం

అప్పట్లానే ఉంది.. ఏం మారింది?

గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొన్ని బ్రాండ్ల మద్యమే దొరికేది. చంద్రబాబు అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మందు ఇస్తామన్నారు. ఇప్పుడు వెళ్తే.. కొత్తగా మారిందేమీ లేదు. మందు అయినా, బీరు అయినా ఏమీ మారలేదు. ప్రభుత్వం నుంచి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి దుకాణాలు వెళ్లాయి.. అంతే తేడా. ఇప్పుడు అంతా సిండికేట్ కావడంతో ధరలు ఎంత పెంచినా అడిగే వారు ఉండరు.

\- జి.రాము, పార్వతీపురం

దేనికైనా.. రెడీ..!

- జమిలీ ఎన్నికలపై మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో ఎప్పుడు.. ఏ ఎన్నికలొచ్చినా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సైన్యం సిద్ధంగా ఉందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. ఎన్నికలేవైనా... దేనికైనా... వైఎస్సార్‌సీపీ రెడీగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులతో వర్క్‌షాప్‌లు నిర్వహించారన్నారు. తాజాగా వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులతో వర్క్‌షాప్ నిర్వహించారని ఎప్పుడు ఏ ఎన్నికలొచ్చినా అంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా తమను మోసం చేస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు నేడు సూపర్ ఫ్లాప్‌గా మారాయన్నారు. కూటమి పాలనలో సంక్షేమ పథకాల ఊసే లేదని, ఆరోగ్యశ్రీ నీరుగారిందని, విద్య, వైద్య రంగాల్లో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందని చెప్పారు. శాండ్, వైన్, మైన్, ల్యాండ్‌లలో కూటమి ఎమ్మెల్యేలు భాగస్వాములై దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు వంద రోజులకే విసిగిపోయారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనతో కూటమి పాలను బేరీజు వేసుకొని ప్రజలు బాధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నట్టు వార్తలొస్తున్నాయని.. ఏ ఎన్నికలు వచ్చినా తమ పార్టీ విజయం ఖాయమని రాజన్నదొర పేర్కొన్నారు.

టీచర్లకు వేసవి సెలవుల్లోనే శిక్షణ నిర్వహించాలి



పార్వతీపురం టౌన్: ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు వేసవి సెలవులలో మాత్రమే నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులకు ఇచ్చే వృత్యంతర శిక్షణలు విద్యాభివృద్ధిని కుంటుపరుస్తాయని తెలిపారు. ప్రస్తుతం 1, 2 తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు తిరుపతి కేంద్రంగా రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వీటిని వెంటనే రద్దు చేసి కేవలం వేసవి సెలవుల్లో డివిజన్, మండల స్థాయిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ ద్వారాగానీ శిక్షణ నిర్వహించాలని కోరారు. 1, 2 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి 26 వరకు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ప్రారంభించి సుమారు 13 విడతలుగా డిసెంబర్ నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు సమాచారం ఉందన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా ప్రతీ జిల్లా నుంచి ఎంపిక చేసిన రిసోర్స్‌పర్సన్‌లకు ముందుగా శిక్షణ ఇచ్చి, వారి ద్వారా ప్రతి మండలాల్లోగాని, రెండు మూడు మండలాలకు కలిపిగాని శిక్షణ ఇవ్వాలని కోరారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



పార్వతీపురం: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు



సీతంపేట: వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఇతర అధికారులు

పార్వతీపురం: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి జీవిత విశేషాలు తెలుసుకొని ఒక ఆదర్శ గురువుగా ఆయన చూపిన మార్గంలో నడవడమే ఆ మహర్షికి మనమిచ్చే నిజమైన గురుదక్షిణ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డీఆర్ఓ జి.కేశవనాయుడు, సహాయ బీసీ సంక్షేమ అధికారి అప్పన్న, ఇతర అధికారులు వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

ఐటీడీఏలో..

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతిని గురువారం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ జి.చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ, జి.నరసింహులు, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంతో కుటుంబాలను చీల్చొద్దు

బొబ్బిలి: మా ఇళ్ల మధ్య మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి కుటుంబాల్లో కలహాలను రేపొద్దని మహిళలు కోరారు. పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని అల్లంరాజు వీధిలో మద్యం దుకాణం పెట్టకుండా అడ్డుకోవాలని గత పదేళ్లుగా పోరాటం చేస్తున్నా.. వైన్ షాపులు పెడుతున్నారని, మా కుటుంబాలు చిన్నాభిన్నం అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని వాపోతూ దుకాణ యజమానులను మహిళలు అడ్డుకున్నారు. ఇటీవల మద్యం దుకాణాల టెండర్లలో లాటరీ సాధించిన వ్యక్తులు మళ్లీ ఇక్కడే దుకాణం పెట్టేందుకు ప్రయత్నించడంతో మహిళలంతా గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. ఇక్కడ మద్యం షాపు పెడితే మా కుటుంబాలలో చిచ్చుపెట్టినట్లేనని, వేరే చోటుకు మార్చండని డిమాండ్ చేశారు. తాగి వస్తున్న యజమాని చేతుల్లో చావుదెబ్బలు తింటున్నామని అధికారులు, పాలకులు పునఃసమీక్షించాలని కోరారు. ఎమ్మెల్యే బేబీనాయన దృష్టికి తీసుకెళతామని, ఇక్కడ షాపు ఏర్పాటు చేస్తే రానున్న పరిణామాలను ఎదుర్కొనాల్సిందేనని హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

డయేరియా డేంజర్ బెల్స్



- గుర్ల మండలంలో మరో ఇద్దరు మృత్యువాత
- ఐదు రోజుల్లో ఏడుకు చేరిన మృతుల సంఖ్య
- కొత్తగా మరో 20 మందికి డయేరియా
- ఇప్పటికి 320కి చేరిన డయేరియా బాధితులు
- సాక్షి కథనంతో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక
- ఎట్టకేలకు డయేరియా నివారణ చర్యలు
- ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
- ప్రైవేట్ బోర్లలో సైతం నీటి పరీక్షలు



తాగునీటి శాంపిల్స్ పరీక్షల వివరాలను తెలుసుకుంటున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/గుర్ల: డయేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. రోగం సోకినవారు ఓ వైపు పిట్టల్లా రాలిపోతున్నారు. గత ఐదు రోజుల్లోనే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వాంతులు, విరేచనాలతో వందల సంఖ్యలో ప్రజలు మంచం పడుతున్నారు. మరోవైపు టీడీపీ కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లే వ్యవహరిస్తోంది. రోగ లక్షణాలు బయటపడిన వెంటనే తగిన నిరోధక చర్యలు తీసుకోలేదు. వైద్యశిబిరాలు కానరాలేదు. అసలు ఈ రోగం వందల మందిని కబళించడానికి కారణమేమిటో తెలుసుకునే ప్రయత్నమూ జరగలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తేలిగ్గా తీసుకున్నారు. ఈ భయానక పరిస్థితిపై 'పడకేసిన ప్రజారోగ్యం' శీర్షికతో గురువారం సాక్షిలో కథనం వెలువడింది. దీంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. గుర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. డయేరియాను అదుపులోకి తీసుకొచ్చేందుకు అవసరమైనా చర్యలు వేగవంతం చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఎట్టకేలకు నివారణ చర్యలు

డయేరియా ప్రభావిత గుర్ల గ్రామంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రక్షిత మంచినీటి సరఫరా విభాగం అధికారులు ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డయేరియా లక్షణాలతో ఉన్న వారికి గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చీపురుపల్లి సీహెచ్‌సీతో పాటు గుర్ల జెడ్పీ హైస్కూల్‌లో పెట్టిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

డయేరియా ప్రభావిత గుర్లలోని ప్రతి వీధిలో కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చేయడంతో పాటు చెత్తా చెదారాలను తొలగిస్తున్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందును పిచికారి చేస్తున్నారు. పూర్తిగా గ్రామాన్ని శానిటైజర్‌తో స్ప్రే చేస్తున్నారు.

242 ప్రైవేట్ బోర్లలో నీటి పరీక్షలు

గుర్ల మండల కేంద్రంలో 242 ప్రైవేట్ బోర్లు ఉన్నట్లు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు గుర్తించారు. వాటి నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేస్తున్నారు. నీరు కలుషితమైన ఐదు బోర్లను గుర్తించారు. వాటిలో నీరు వినియోగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయిస్తున్నారు. ఆ నీటిని మాత్రమే వినియోగించాలని ప్రజలకు సూచిస్తున్నారు. కాచి వడబోసిన తర్వాత మాత్రమే తాగాలని అవగాహన కల్పిస్తున్నారు.



డయేరియా రోగులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మరో ఇద్దరి మృత్యువాత



బోడసింగి రాములమ్మ (ఫైల్)

డయేరియా అదుపులోకి రావట్లేదు. గురువారం కొత్తగా మరో 20 కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటివరకూ డయేరియా బారినపడిన వారి సంఖ్య 300 నుంచి 320కు పెరిగింది. మరోవైపు మృతుల సంఖ్య ఏడుకు చేరింది. గురువారం బోడసింగి రాములమ్మ (67), మరడాన అప్పలనర్సయ్యమ్మ (57) డయేరియాతో ప్రాణాలు కోల్పోయారు. రాములమ్మకు రెండ్రోజుల క్రితమే డయేరియా సోకింది. తొలుత ఆమెకు గుర్లలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స అందించారు. రోగం తగ్గిపోయిందని బుధవారం ఆమెను కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లిపోయారు. గురువారం ఉదయం మళ్లీ వాంతులు, విరేచనాలు అవ్వడంతో ఆమె పరిస్థితి విషమించింది. తీరా ఆస్పత్రికి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు సిద్ధమవుతుండగానే ఆమె చనిపోయింది. అప్పలనర్సయ్యమ్మకు కూడా మూడ్రోజుల క్రితమే డయేరియా సోకింది. ఆమెకు తొలుత గుర్ల పీహెచ్‌సీలో వైద్యం అందించారు. తర్వాత విజయనగరం జిల్లా సర్వజన ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. కానీ ఆమె పరిస్థితి తీవ్రంగా ఉండటంతో కేజీహెచ్‌కు అక్కడి వైద్యులు రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది.

అంతా భయబ్రాంతుల్లోనే...

మండల కేంద్రమైన గుర్లతో పాటు గుర్ల మండలంలోని కోటగండ్రేడు, గోషాడ గ్రామాల్లో డయేరియా విజృంభించడంతో ప్రజలంతా భయబ్రాంతుల్లో ఉన్నారు. గుర్ల పీహెచ్‌సీలో తగిన సంఖ్యలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది లేరు. దీంతో గుర్ల జెడ్పీ హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తరగతి గదుల్లోని విద్యార్థుల బెంచీలపైనే రోగులను పడుకోబెట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇతర ఆస్పత్రుల నుంచి పది మంది వైద్యాధికారులను, 50 మంది వైద్య సిబ్బందిని ఇక్కడ నియమించారు. ఇప్పటివరకు ఈ శిబిరంలో సుమారు 200 మంది వరకూ చికిత్స పొందారు. ప్రస్తుతం గుర్ల పీహెచ్‌సీలో 20 మంది, చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో 15 మంది, జిల్లా కేంద్రంలోని సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో పది మంది, ఘోషా ఆస్పత్రిలో 15 మంది, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 40 మంది చికిత్స పొందుతున్నారు.

'ఉల్లాస్' లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్



ఉల్లాస్ కార్యక్రమంపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: కేంద్రం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం కింద ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వయోజన విద్య నోడల్ అధికారిని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వయోజన విద్యాశాఖ సిబ్బందితో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 23వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. లక్ష్యాన్ని అధిగమించేందుకు మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించడంతో పాటు అధికారులతో సమన్వయం చేసుకొనేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నిరక్షరాస్యుల కోసం ప్రచురించే పుస్తకాలు మండల, జిల్లా స్థాయిలో సరఫరా చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో 53 శాతం ఉన్న అక్షరాస్యతను ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మరింత పెరిగేలా పని చేయాలన్నారు. కార్యక్రమం ముగింపు రోజున ధ్రువీకరణ పత్రం, పథకాలు బహుకరించి ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో వయోజన విద్య నోడల్ అధికారి టి. వైకుంఠరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, సీడీపీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

పార్వతీపురం: గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులు, కిశోర్ బాలికల్లో రక్తహీనత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సీడీపీఓలకు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళ, శిశు సంక్షేమ అధికారులు, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని అందుకు అవసరమైన పోషక పదార్థాలు అందించాలన్నారు. పాలు, ఆకుకూరలు, గుడ్లు, చెక్కీలు తదితరమైనవి తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పిల్లల్లో బరువు, ఎత్తులను ప్రతీ వారం రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ సొంత భవనాలకు పెయింటింగ్స్, తాగునీరు, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పిల్లలందరూ కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, వివిధ మండలాల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కావ్య ఎంపిక


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థిని కావ్య

బొబ్బిలి రూరల్: మండలంలోని నారసింహునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని కారంగి కావ్య రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఇటీవల అండర్ 14 విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కావ్య రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం ఎస్.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కావ్యను పీడీ జి. శశికళ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందిస్తు, రాష్టస్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలంటూ ప్రోత్సహించారు.

గంజాయి నిందితుడి అరెస్టు


గంజాయి నిందితుడితో ఎస్.కోట సీఐ రమణమూర్తి తదితరులు

శృంగవరపుకోట: గంజాయి అక్రమ రవాణా చేస్తూ, పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్న నిందితుడిని ఎస్.కోట పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.వెంకటరమణమూర్తి తెలిపిన ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. 2021 అక్టోబర్ నెలలో బొడ్డవర చెక్‌పోస్టు వద్ద 90కిలోల గంజాయితో వస్తున్న మారుతి ఆల్టో 800 కారును పోలీసులను చూసి వదిలిపెట్టి అల్లూరి జిల్లా, డుంబ్రిగూడ మండలానికి చెందిన పాంగి కృష్ణ పరారయ్యాడు. ఆ నిందితుడి కోసం ఎస్.కోట పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అందిన సమాచారంతో గురువారం ఎస్.కోట ఆర్టీసీకాంప్లెక్స్ వద్ద మాటువేసి పాంగి కృష్ణను అరెస్టు చేసి, కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు.

కోడిశలో పోలీస్ పికెట్

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామంలో గురువారం పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. గ్రామంలోని ఇరువర్గాల మధ్య గొడవలు రేగండంతో వైఎస్సార్‌సీపీ నేత పెంటన్నాయుడుపై దాడులు జరిగాయి. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని, గ్రామంలో పెద్ద సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ఎస్సై నీలావతి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలి

- ఏపీ పాల రైతుల సంఘం నాయకుడు ఎస్.గోపాలం
- నేడు జామిలో పాల రైతుల జిల్లా సదస్సు


వెలగవలసలో నిరసన తెలుపుతున్న పాల రైతులతో సంఘం నాయకుడు గోపాలం

తెర్లాం: జిల్లాలో గల పాల రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ పాల రైతుల సంఘం నాయకుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఈ మేరకు పాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వెలగవలస పాలకేంద్రం వద్ద రైతులతో కలిసి గురువారం ఆయన నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లాలోని జామి మండల కేంద్రంలో పాల రైతుల జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాల రైతులంతా పాల్గొని సదస్సును విజయంతం చేయాలని కోరారు.

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి

- అన్నమయ్య జానపద కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుత సమాజంలో సంప్రదాయబద్ధ కళలను, కళాకారులను పరిరక్షించుకోవాలని అవసరం ఎంతైనా ఉందని అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి అన్నారు. మండలంలోని రామతీర్థం కల్యాణ మండపం ఆవరణలో భజన మండలి, కోలాట బృందాల సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైందవ ఘతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాల్లో భక్తి భజనలు, కోలాటాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి శనివారం ఆయా దేవాలయాల్లో భజనలు చేసుకునే అవకాశం కల్పించి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. రామతీర్థంలో నిత్యన్నప్రసాదం 50 మందికి మాత్రమే పరిమితం చేస్తున్నారని.. వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేయాలన్నారు. అనంతరం భక్తజన బృందాలతో నూతన కమిటీని ఏర్పాటు చేసి పలు కీలక విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరావు, గొర్లి రాముునాయుడు, పతివాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భరోసా అందక నిరాశ..!

- నిషేధం తరువాత వేట ప్రారంభమై నాలుగు నెలలు
- మత్స్యకార సాయం ఊసెత్తని సర్కారు
- ప్రభుత్వం నిర్ణయం కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- గడిచిన ఐదేళ్లు సాఫీగా సాగిన చేపలవేట


వేట చేసి చింతపల్లి తీరం చేరుతున్న బోటు

పూసపాటిరేగ: సముద్రంలో చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేట నిషేధ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సముద్రంలో వేట నిషేధ సమయం ముగిసి నాలుగు నెలలు దాటుతున్నా రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన సర్కారు నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులకు ఈఏడాది మత్స్యకార భరోసా అందని ద్రాక్షలా మిగలడంతో నిరాశతో ఇబ్బంది పడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసాను రెండున్నర రెట్లు పెంచడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచి వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున వారి అకౌంట్‌లో జమచేశారు. అయితే నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మత్స్యకార భరోసాపై కనీసం ప్రకటన చేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేలు ఉన్న మత్స్యకార భరోసాను రూ.10 వేలకు పెంచి వెంటనే వారి అకౌంట్‌లలోకి జమచేసారు. 2020, 2021,2022,2023 సంవత్సరాల్లో క్రమం తప్పకుండా మత్స్యకారుల ఖాతాలకు నగదు జమచేశారు. జిల్లాలో ఈఏడాది మత్స్యకార భరోసాకు 3798 మంది మత్స్యకారులను ఎంపిక చేశారు. సర్వే కూడా పూర్తయిన తరువాత అర్హులను గుర్తించి జాబితాను ప్రభుత్వానికి నివేదించారు.

21వేల మందికి జీవానాధారం

జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలో మీటర్ల తీరం ఉంది. ఆ తీరప్రాంతం పరిధిలో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. చేపల వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, పరోక్షంగా 15 వేల మంది ఆధార పడి ఉన్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం 61 రోజుల పాటు వేట నిషేధం ప్రకటించింది. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. కానీ నూతనగా ఏర్పడిన ప్రభుత్వం ఆ సాయం ఊసెత్తకపోవడంతో అసలు సాయం అందిస్తారా? లేదంటే ఈ పథకానికి మంగళం పాడుతారా? అనే విషయమై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

మత్స్యకార భరోసా మరివ్వరా?

వేటే ప్రధాన ఆదారంగా జీవిస్తున్న మత్స్యకారులకు నాలుగు నెలలు దాటుతున్నా భరోసా అందించకపోవడం దారుణం. నిషేధసమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. గతంలో నిషేధ సమయంలోనే ఠంచన్‌గా నగదు అకౌంట్‌కు జమచేశారు. నూతన ప్రభుత్వంలో మత్స్యకార భరోసాపై పట్టించుకోకపోవడంతో ఆందోళనగా ఉంది.

కొర్లయ్య, మత్స్యకారుడు చింతపల్లి

బడిపిల్లలకు కంటిపరీక్షలు

- పాఠశాలల్లో ఈ నెలాఖరు వరకు నిర్వహణ
- ఇప్పటివరకు 51,115 మందికి పూర్తి


పార్వతీపురంలోని చాకలి బెలగాం రెసిడెన్షియల్ పాఠశాలలో నేత్ర పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: కంటిచూపు బాగుంటేనే ప్రపంచంలో దేనినైనా సాధించగలం. అయితే ప్రస్తుతం మొబైల్ హవా సాగుతుండడంవల్ల పిల్లల్లోనూ దృష్టి లోపాలు అధికంగా ఉన్నట్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థుల ఐ స్క్రీనింగ్ కార్యక్రమంలో వెల్లడైంది. ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ప్రారంభమైన కంటి పరీక్షల కార్యక్రమాలు ఈ నెల 31 వరకు జరగనున్నాయి. రాష్ట్ర అంధత్వ నివారణ సంస్థ ఆదేశాలమేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ఆప్తాల్మిక్ అధికారులు, ఆప్తాలమిక్ సహాయకులు బృందాలుగా ఏర్పడి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మొబైల్ వినియోగంలో ఎక్కువ శాతం విద్యార్థులే ..

ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం వల్ల పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగం అధికం కావడం, ఇంటికి చేరిన తరువాత గేములు, రీల్స్, సినిమాలు చూడడానికి మొబైల్‌నే వినియోగిస్తున్నారు. మొబైల్ వినియోగానికి విద్యార్థులు అలవాటు పడిపోయారు. ఎక్కువ సమయం సెల్ ఫోన్ స్క్రీన్ చూడడం వల్ల అధికంగా దృష్టి దోషాలు వస్తున్నట్లు అంధత్వ నివారణ అధికారులు గుర్తించారు.

విద్యార్థుల్లో అంధత్వాన్ని నివారించడమే ధ్యేయం

విద్యార్థుల్లో అంధత్వాన్ని నివారించడమే ధ్యేయంగా కంటి పరీక్షల కార్యక్రమం నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 31లోగా పూర్తి చేస్తాం. విద్యార్థుల్లో లోపాలు ఉంటే గుర్తించి సరైన చికిత్స తక్షణమే అందజేస్తున్నాం. విదార్థుల్లో ఎక్కువ శాతం మొబైల్ వినియోగం వల్ల దృష్టి లోపాలు వస్తున్నాయి. తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి.

–డాక్టర్ సుకుమార్ బాబు,
జిల్లా అంధత్వ నివారణ అధికారి

జిల్లా వ్యాప్తంగా నిర్వహణ

స్కూల్ హెల్త్ కార్యక్రమాన్ని వైద్యులు రూపొందించిన ప్రణాళికల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరం. మండలాల వారీగా కార్యక్రమం నిర్వహణకు సంబంధిత ఎంఈఓలను అదేశించాం. అంధత్వ నివారణ సంస్థ, విద్యాశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాం.

–జి. పగడాలమ్మ,
డీఈఓ, పార్వతీపురం మన్యం

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్ మృతి


మల్లిబాబు(ఫైల్)

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ కె.మల్లిబాబు(48) మృతిచెందారు. కురుపాం మండలంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఉద్యోగరీత్యా హిరమండలంలో స్థిరపడిన కె.మల్లిబాబు ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జరడ నుంచి నీలకంఠాపురం మధ్యలో ఉన్న ఘాట్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పగా రోడ్డుపై పడిపోయారు. రోడ్డుపై పడిపోయిన మల్లిబాబు అక్కడికక్కడే మృతిచెందారు. ఆయన స్వగ్రామం పాలకొండ సమీపంలోని గొట్టమంగళాపురం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. , మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు తెలిపారు.

చెరువులో పడి హోం గార్డు..


గార సింహగిరి (ఫైల్)

కొమరాడ: హైదరాబాద్‌లో హోం గార్డుగా పనిచేస్తున్న కొమరాడ మండలంలోని విక్రంపురం పంచాయతీ చంద్రంపేట గ్రామానికి చెందిన గార సింహగిరి(42) చెరువులో పడి గురువారం మృతిచెందారు. పదేళ్ల క్రితం హైదరాబాద్‌లో హోంగార్డు ఉద్యోగం సంపాదించి అక్కడే విధులు నిర్వహిస్తూ కుటుంబంతో ఉంటున్నారు. ఇటీవల ఆయనకు కుమారుడు జన్మించడంతో రెండునెలలు సెలవుపై సొంత ఊరికి వచ్చి సంతోషంగా గడపుతున్న సమయంలో గురువారం గ్రామ పరిసరాల్లో ఉన్న పెద్ద చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయారు. చెరువులో చేపలు పట్టడానికి వేసిన వలలో చిక్కుకున్న ఆయన ఊపిరాడక నీటిలో మృతిచెందారు. ఆయనకు భార్య భవాని, కుమారుడు మోహిత్ ఉండగా ఇటీవల మరో కుమారుడు జన్మించాడు. ఈ ఘటనపై కొమరాడ పోలీసులు కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమత్తం జిల్లా కేంద్రాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

రైలులో గుండె పోటుతో వ్యక్తి..


రైలులో మృతి చెందిన బండారి సన్యాసిరావు

పార్వతీపురంటౌన్: రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి గుండె పోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన లడ్డ-పార్వతీపురం రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం జరిగింది. ఈ ఘటనపై జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు రాయగడ నుంచి విజయనగరం రైలులో వెళ్తున్న బంగారి సన్యాసిరావు (57)కు గుండెపోటు రావడంతో రైలులోనే మృతిచెందాడు. ఈ విషయం గమనించిన తోటి ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం చేరవేశారు. దీనిపై స్పందించిన పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులను రప్పించి మృతదేహాన్ని రాయగడ తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

విజయనగరం క్రైమ్: బైక్ ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతున్న బొండపల్లి మండలం రయింద్రం గ్రామానికి చెందిన ఎర్రినాయుడు (44) గురువారం మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 15న స్థానిక సీఎంఆర్ జంక్షన్ వైపు ఎర్రినాయుడు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి స్థానికులు వారిద్దరినీత తరలించగా ఎర్రినాయుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి పరిస్థితి కూడా సీరియస్‌గా ఉందని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక గురువారం జరిగింది. ఈ మేరకు అండర్-14,17 వయస్సుల విభాగాల్లో వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించారు. రాజీవ్ స్టేడియం, కోడిరామ్మూర్తి వ్యాయామ సమాజం ప్రాంగణాల్లో నిర్వహించిన పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్, కోచ్ బి.ఈశ్వరరావులు హాజరై ప్రారంభించారు. ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీ పడగా..వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వాయుగుండం ప్రభావంతో వర్షం కురవగా అండర్-17 విభాగంలో బాలికలకు నిర్వహించాల్సిన వాలీబాల్ జట్ల ఎంపిక శుక్రవారానికి వాయిదా వేశారు. అలాగే అండర్-14 విభాగంలో విజ్జి స్టేడియంలో నిర్వహించాల్సిన క్రికెట్ జట్టు ఎంపిక కూడా వాయిదా వేయగా..మళ్లీ పోటీలు నిర్వహించే తేదీని ప్రకటించనున్నారు.

నేటి నుంచి జరిగ్గే ఎంపికల షెడ్యూల్ ఇదే...

జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన స్కూల్‌గేమ్స్ జట్ల ఎంపిక పోటీల తేదీలను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు గురువారం ప్రకటించారు. ఆయా తేదీల్లో అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అండర్-14,17 వయస్సుల విభాగాలో బాల,బాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తేదీ	క్రీడాంశం	ఎంపిక జరిగే ప్రదేశం
18-10	రోప్‌స్కిప్పింగ్	పీఎస్ఆర్ స్కూల్, విజయనగరం
18-10	చెస్	డీవీఎం స్కూల్, పార్వతీపురం
19-10	హాకీ	రాజీవ్ స్టేడియం, విజయనగరం
19-10	క్రికెట్ (అండర్-17)	విజ్జి స్టేడియం, విజయనగరం
19-10	అథ్లెటిక్స్ (అండర్-17)	విజ్జి స్టేడియం, విజయనగరం
19-10	బాల్ బ్యాడ్మింటన్	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్.కోట
19-10	త్రోబాల్	రాజీవ్ స్టేడియం, విజయనగరం
19-10	రగ్బీ	జెడ్పీ హైస్కూల్, గరుడబిల్లి
21-10	షటిల్ బ్యాడ్మింటన్	రాజీవ్ స్టేడియం, విజయనగరం
21-10	కబడ్డీ	జెడ్పీ హైస్కూల్, రఘుమండ
22-10	వాలీబాల్(అండర్-14)	జెడ్పీ హైస్కూల్, భోగాపురం
23-10	ఖోఖో	జెడ్పీ హైస్కూల్, మరుపల్లి
23-10	అథ్లెటిక్స్ (అండర్-14)	జెడ్పీ హైస్కూల్, ఎంఆర్ నగరం

డయేరియా రోగులతో కిటకిలాడుతున్న సర్వజన ఆస్పత్రి


సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: డయేరియా రోగులతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కిటకిటలాడుతోంది. మేల్, ఫిమేల్ వార్డుల్లో రోగులు చికిత్స పొందుతున్నారు. విజయనగరం పట్టణంతో పాటు గుర్ల, గజపతినగరం, గరివిడి, గంట్యాడ మండలాలకు చెందిన రోగులకు వ్యాధి తీవ్రత ఎక్కువ ఉండడంతో రోజుల తరబడి ఆస్పత్రిలోనే ఉండి చికిత్స తీసుకుంటున్నారు.

దాడులతో భయపెట్టలేరు

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


ప్రభుత్వ ఆస్పత్రిలో పెంటన్నాయుడిని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలపై దాడులు చేసి తమను, పార్టీని భయపెట్టలేరని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి కోలుకుంటున్న రేగిడి మండలం కోడిశ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నెల్లి పెంటన్నాయుడిని రాజాం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులను అరికట్టేలా చూడాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అభిమానులతో పాటు ప్రజలకు తామంతా ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఇటు రాజాంలో, అటు రాష్ట్రంలో ప్రభుత్వం హత్యారాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తామని, ఈ విషయాన్ని టీటీపీ వారు మరిచిపోవద్దని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో టీడీపీ, జనసేన అరాచకపాలన బయటపడుతుందని, ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, అభిమాని ఓపికతో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్, రేగిడి మండలాల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాల నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, యాలాల వెంకటేష్, సర్పంచ్‌లు కెల్ల మన్మథరావు, కర్రి జగదీష్, పార్టీ నాయకులు ముదిలి జనార్దనరావు, ఆల్తి రాంబాబు, కరణం శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹264

వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ నివాళులు

పార్వతీపురంటౌన్:

జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటిలాగా చదువుకు ప్రామాణికమైన విద్యాలయాలు అప్పట్లో లేవని, ఆ రోజుల్లో ఆశ్రమాల్లో జ్ఞాన సంపదను నేర్చుకుని, భావితరాల వారికి ఆదర్శప్రాయంగా ఉండేవిధంగా రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహా పండితుడు వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డా. ఒ.దిలీప్ కిరణ్, ఏఆర్ డీఎస్పీ ఎస్.వెంకట అప్పారావు, ఆర్ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, జిల్లా ఆర్మ్‌డ్, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వాల్మీకి మహర్షి చిత్ర పటానికి నివాళులర్పించిన ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

బాధ్యులను శిక్షించి.. న్యాయం చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మృతుడి తండ్రి అప్పడు తదితరులు

పార్వతీపురం: తన కుమారుడు రాకేష్ మరణానికి బాధ్యులైన వారిని శిక్షించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కర్రి అప్పడు వినతి పత్రం అందజేశాడు. ఈ విషయంపై అప్పడు మాట్లాడుతూ తమ కుమారుడు గ్రామంలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఈనెల 14న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అమ్మాయి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు పెట్టి విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని చెప్పాడు. ఈనెల 15న (మంగళవారం) ఉదయం 9.30గంటలకు తమ కుమారుడు రాకేష్ స్టేషన్ నుంచి పారిపోయినట్లు ఎస్సై తమకు తెలిపారన్నారు. 16న ఉదయం బెలగాం రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ట్రాక్‌పై తల, మొండెం వేరుగా పడి చనిపోయి, మమ్మల్ని అనాథలు చేశాడని వాపోయాడు. స్టేషన్‌లో కస్టడీలో ఉన్న వ్యక్తి ఎలా తప్పించుకుంటాడని, ఎస్సై బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించి తమ కుమారుడి మరణానికి కారణమయ్యాడని కన్నీటిపర్యంతమయ్యాడు. అలాగే తప్పుడు ఫిర్యాదు చేసి వేధించిన కుమార్తె తల్లిదండ్రులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తమ కుమారుడి మరణంలో కుట్రకోణం ఉందని, చనిపోయేంత పిరికివాడు కాదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి న్యాయం చేయాలని కోరాడు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఎస్పీతో చర్చించి తగు న్యాయం చేస్తానని పోస్టుమార్టం నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

పోటీపోటీగా మద్యం దుకాణాలు ప్రారంభం

లక్కవరపుకోట:

మండలంలోని మద్యం దుకాణాలు గురువారం పోటాపోటీగా ప్రారంభమయ్యాయి. గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద గురువారం కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మండలంలో ఆరు మద్యం షాపులకు లాటరీ నిర్వహించగా అరుగురు వ్యక్తులు దక్కించుకున్నారు. అయితే గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద గతంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం భవనంతో పాటు పక్కనే ఆనుకుని ఉన్న మరో భవనాన్ని సంబంధిత యజమాని వద్ద మేడిబోయిన తులసీదాస్ లీజుకు తీసుకుని షాపును ప్రారంభించారు. అయితే అదే భవనం వద్ద టీడీపీ సానుభూతి పరుడు చొప్ప దేముడు కూడా మద్యం షాపును ప్రారంభించాడు. దీంతో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తాము లీజుకు తీసుకుని షాపు ప్రారంభించిన వద్ద దౌర్జన్యంగా తెలుగుదేశం సానుభూతిపరులు షాపు పెట్టడం దారుణమని తులసీదాస్ వాపోయారు. ఈ పరిస్థితిలో స్థానిక ఎస్సై నవీన్‌పడాల్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని శాంతింప చేసి లీజ్ పేపర్ల మేరకు పక్కనే ఉన్న భవనంలో తులసీదాస్ షాపును ప్రారంభించి అమ్మకాలు చేసుకోమని చెప్పారు. అదేషాపు ఎదురుగా వున్న చిన్నపాటి పాన్‌షాపులో చొప్ప దేముడిని ప్రస్తుతానికి అమ్మకాలు చేసుకోమని సూచించారు. ముందస్తు భద్రత నిమిత్తం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కాగా ఈ విషయమై ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ నాయుడిని వివరణ కోరగా లాటరీలో షాపులు దక్కించుకున్న యజమానులకు ప్రొవిజనల్ లైసెన్స్‌లే ఇచ్చామని వాటి ప్రకారం వారం రోజుల పాటు గుడి, బడికి దూరంగా మండలంలో ఎక్కడైనా షాపులు ప్రారంభించి అమ్మకాలు చేసుకోవచ్చని చెప్పారు. గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద గల ప్రభుత్వ షాపులో ఓల్డ్‌సాటక్‌ను ఇంకా క్లియర్ చేయలేదని, మరో రెండు రోజుల్లో క్లియర్ చేస్తామన్నారు. ఆ తరువాత ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అంతవరకు సంయమనం పాటించి వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు.


ఇరువర్గాలవారిని శాంతిపజేస్తున్న ఎల్.కోట ఎస్సై నవీన్ పడాల్